కుప్పకూలిన రియల్ కలలు

- అమ్మకాల్లేవ్.. కొనుగోళ్లు లేవు
- రాష్ట్రంలో స్తంభించిన నిర్మాణ రంగం
- హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో నిలిచిపోయిన ప్రాజెక్టులు
- అగమ్యగోచరంగా మారిపోయిన రెసిడెన్షియల్ మార్కెట్ పరిస్థితి
- కొనుగోలు చేసేందుకు ముందుకురాని ఇండ్ల కొనుగోలుదారులు
- వెంటాడుతున్న హైడ్రా భయాలు
- దిక్కుతోచని స్థితిలో బిల్డర్లు

పాతికేండ్ల సాగర్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఐదంకెల జీతం వస్తుండటంతో ఇల్లు కొనేందుకు సిద్ధమయ్యాడు. కానీ, ఇప్పుడున్న పరిస్థితితో కొంతకాలం ఆగడమే ఉత్తమమని మానుకున్నాడు.

శేషగిరి ఒక బిల్డర్. రెండు దశాబ్దాలుగా నిర్మాణ రంగంలోనే స్థిరపడ్డాడు. ఇండ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కానీ, పది నెలలుగా సీన్ రివర్సైంది. కట్టిన ఇండ్లు అమ్ముడుపోక, పెట్టుబడి భారంగా మారింది. అప్పుల భయంతో ఆత్మహత్యే శరణ్యం అన్నట్టుగా పరిస్థితి తయారైంది.

ఒక్క సాగర్, శేషగిరిలదే కాదు ఈ పరిస్థితి. ఇలాంటి వారెందరో కనిపిస్తున్నారు ఇప్పుడు. మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న రాష్ట్ర రియల్‌ఎస్టేట్ మార్కెట్.. పది నెలలుగా కళ తప్పింది. అటు బయ్యర్లు, ఇటు సెల్లర్లు ఒక్కసారిగా డైలమాలో పడిపోయారు. ఫలితంగా భారీ మొత్తంలో లావాదేవీలు స్తంభించిపోయాయి. కొత్త నిర్మాణాల్లేక, పూర్తయినవి అమ్ముడుపోక కరోనా నాటి భయానక పరిణామాలు మళ్లీ తలెత్తడం ప్రస్తుతం అత్యంత ఆందోళనకరం.

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): సొంతిల్లు.. మధ్యతరగతి ప్రజల జీవిత కాల స్వప్నం. ఈ కలలు ఇప్పుడు చెదిరిపోతున్నాయి. మారిన ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ స్వరూపం, ప్రభుత్వ విధానాలు.. అన్నీ కలిసి రాష్ట్రంలో సగటు కుటుంబాల సొంతింటి కలలను చిదిమేశాయి. రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం కుప్పకూలింది. కొనేవారు లేక అమ్మేవారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెట్టిన పెట్టుబడులు రాక బిల్డర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో కరోనా నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయి. ఇందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాలే ఉదాహరణ. 2020-21లో కొవిడ్ కారణంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 4.81 లక్షల రిజిస్ట్రేషన్లు మాత్రమే నమోదయ్యాయి. 2021-22 తొలి ఆరు నెలల్లో 9.25 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. తర్వాత రెండేండ్లు వరుసగా ఆరు నెలల్లోనే 10 లక్షలకుపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కేవలం 9.19 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అంటే 2021-22 కన్నా తక్కువ. కొవిడ్ రెండో వేవ్, మూడో వేవ్ ముప్పును కూడా తట్టుకున్న రాష్ట్ర రియల్‌ఎస్టేట్ రంగం.. ప్రభుత్వ అసంబద్ధ విధానాలతో అంతకుమించిన విపత్తును ఎదుర్కొంటున్నదని నిపుణులు చెప్తున్నారు.

ఆగిన ప్రాజెక్టులు

రాష్ట్ర రియల్‌ఎస్టేట్ మార్కెట్‌కు ప్రధాన కేంద్రమైన హైదరాబాద్‌లో నెలకొన్న పరిస్థితులు యావత్తు విపణినే ప్రభావితం చేస్తున్నాయి. కొత్త ప్రాజెక్టులు ఆగిపోయాయి. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి శివారు ప్రాంతాల్లో ఎక్కడిదక్కడే అన్నట్టు తయారైంది. కొల్లూరులో హాల్‌మార్క్ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. మరెన్నో ప్రాజెక్టులదీ ఇదే పరిస్థితి.100-200 గజాల్లో ఇండిపెండెంట్ హౌజ్‌లు నిర్మించిన వారి కష్టాలైతే అన్నీ ఇన్నీ కావు. మార్కెట్ బాగుంది కదా అని అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టినవారిని నష్టాలు వెంటాడుతున్నాయి. 10-20 ఫ్లాట్లతో నిర్మించిన అపార్ట్‌మెంట్లలో పనులకు బిల్డర్లు విరామం ప్రకటించారు.

వివిధ సంవత్సరాల్లో ఏప్రిల్-సెప్టెంబర్ మాసాల్లో రిజిస్ట్రేషన్లు



పైసా.. రాక-పోక లేదు

అమ్మకాల్లేక బిల్డర్లు నగదు కొరతను ఎదుర్కొంటున్నారు. ఇన్నాళ్లూ సజావుగా సాగిన రియల్‌ఎస్టేట్ కార్యకలాపాలు, లావాదేవీలు ఇప్పుడు ఒక్కసారిగా నిలిచిపోవడంతో చేతుల్లో పైసల్లేని దుస్థితి నెలకొంటున్నది. బ్యాంకులు రుణాలిచ్చేందుకూ మొహం చాటేస్తుండటంతో పరిస్థితులు కఠినంగా మారిపోయాయి. ఒక్క హైదరాబాద్‌లోనేగాక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ నిర్మాణ రంగం కుదేలవడం ఆందోళనకరం. తెలంగాణ వచ్చిన తర్వాత తొలి తొమ్మిదిన్నరేండ్లలో పెరుగుతూ పోయిన భూముల ధరలు.. ఇప్పుడు మళ్లీ నేల చూపులు చూస్తున్నాయి. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో అంతటా రియల్‌ఎస్టేట్ బూమ్ ఏర్పడింది. ఎందరో మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యాయి. కానీ, రియల్‌ఎస్టేట్ డౌన్‌తో అంతా తలకిందులవుతున్నది.

రిజిస్ట్రేషన్ల ఆదాయం ఆవిరి

రియల్‌ఎస్టేట్‌లో నెలకొన్న మందగమనం.. రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని ఆవిరి చేసింది. ఒక్క సెప్టెంబర్ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖ రెవెన్యూ 30% పడిపోవడం గమనార్హం. గత నెలలో 80 వేల లావాదేవీలే నమోదయ్యాయి. వీటి విలువ రూ.650 కోట్లు మాత్రమే. హైడ్రా రాకతో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి శివారు ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ లావాదేవీలు పూర్తిగా తగ్గిపోయాయని చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించినా.. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో రిజిస్ట్రేషన్లు సంఖ్య, ఆదాయం గణనీయంగా పడిపోయిందని గణాంకాలు చెప్తున్నాయి. జూలైతో పోల్చితే ఆగస్టులో రిజిస్ట్రేషన్లు 27.39% తగ్గగా, ఆదాయం 30% పడిపోయింది. ఆగస్టుతో పోల్చితే సెప్టెంబర్‌లో రిజిస్ట్రేషన్లు 13% తగ్గగా.. ఖజానాకు 28% రాబడి తగ్గినట్టు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. మొత్తంగా హైడ్రా రాకముందు జూలైలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.1,531 కోట్ల ఆదాయం రాగా.. సెప్టెంబర్ నాటికి రూ.770 కోట్లకు పడిపోయిందని చెప్తున్నారు. అంటే రాబడి సగం తగ్గిందని పేర్కొంటున్నారు.

స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాల ప్రకారం గత మూడు నెలల్లో లావాదేవీలు ఇలా..

నెల	రిజిస్ట్రేషన్లు	తగ్గుదల	ఆదాయం(రూ.కోట్లలో)	తగ్గుదల (రూ.కోట్లలో)
జూలై	2,04,716	--	1,531.32	--
ఆగస్టు	1,48,643	56,073	1,071.29	460.03
సెప్టెంబర్	1,29,784	18,859	770.36	300.93

ఆఫీస్ మార్కెట్.. ఔట్

హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ అంటేనే హాట్ కేక్. అయితే ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు నగరంలో ఆఫీస్ స్పేస్‌లకు డిమాండే కరువైంది. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'ఏ' గ్రేడ్ ఆఫీస్ బిల్డింగులు చాలావరకు ఖాళీగానే దర్శనమిస్తుండటం ఇందుకు అద్దం పడుతున్నది. 15 లక్షల చదరపు అడుగుల నుంచి 50 లక్షల చదరపు అడుగుల వరకున్న ఆఫీస్ స్పేస్‌లు లీజింగ్‌కు నోచుకోవడం లేదు. కొత్త కంపెనీలు రాక, పెట్టుబడులు లేక ఆఫీస్ స్పేస్ కళ తప్పింది. నిజానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోకి ఐటీ, డాటా కంపెనీలు పెద్ద ఎత్తున రావడంతో ఇక్కడ భారీగానే నిర్మాణాలు జరిగాయి. కానీ ప్రభుత్వం మారడం, వ్యాపార, పారిశ్రామిక రంగాలు నిరాదరణకు గురవడంతో మార్కెట్‌లోనూ ఆ నీరసం కనిపిస్తున్నది.

విజన్ లేని రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విజన్ అంటూ లేకపోవడం కూడా రియల్‌ఎస్టేట్ మార్కెట్‌కు శాపంలా తయారైందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వ్యాపార, పారిశ్రామిక రంగాలపై దృష్టి కొరవడటంతో పెట్టుబడులు రాక ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఆగమైపోయింది. మరోవైపు హైడ్రా పేరిట తీసుకుంటున్న చర్యలు, నిర్ణయాలు.. రెసిడెన్షియల్ మార్కెట్‌ను కుదేలు చేస్తున్నాయి. ఇకపై కూడా ఇలాగే ఉంటే రియల్‌ఎస్టేట్ మార్కెట్ దారుణంగా దెబ్బతింటుందని, అనుబంధ రంగాలూ కోలుకోలేవని ఇండస్ట్రీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో వచ్చిన ప్రయోజనం అంతా దూరమైపోతున్నదన్న ఆవేదన వారిలో కనిపిస్తున్నది.

హైడ్రాతో కుదేలు

తెలంగాణలో గత రెండు నెలలుగా రియల్‌ఎస్టేట్ మార్కెట్ కార్యకలాపాలు, లావాదేవీలు క్షీణించాయి. హైదరాబాద్ అభివృద్ధి ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. అమాయక ప్రజల ఇండ్ల మీదికి కాంగ్రెస్ సర్కారు బుల్డోజర్లను తోలుతున్నది. ఏరకంగానూ రాష్ట్ర సంపదను పెంచలేకపోతున్న రేవంత్‌రెడ్డి.. ఇక్కడి ఆదాయ వనరులను మాత్రం పూర్తిగా ధ్వంసం చేసే పనిలోపడ్డారు. ఇదంతా చూస్తుంటే తెలంగాణ భవిష్యత్ ఏమిటా? అన్న ఆందోళన కలుగుతున్నది.

- 'ఎక్స్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కన్సల్టెంట్ల నివేదికలివి

ఈ ఏడాది మొదలు హైదరాబాద్‌లో స్థిరాస్తి అమ్మకాలు పడిపోతూనే ఉన్నాయి. జనవరి-మార్చిలో 19,660 ఇండ్ల అమ్మకాలు జరిగితే, ఏప్రిల్-జూన్‌లో 15,085 యూనిట్లకే పరిమితమయ్యాయి. 23% క్షీణించాయి. **- అనరాక్**

ఈ సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్ హౌజింగ్ సేల్స్‌లో 19% పతనం కనిపించింది. గత ఏడాది ఇదే వ్యవధిలో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగితే, ఈ ఏడాది జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లే అమ్ముడుపోయాయి. **- ప్రాప్‌టైగర్**

హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ మార్కెట్ నిరాశాజనకంగా ఉన్నది. ఈ జూలై-సెప్టెంబర్‌లో మొదలైన కొత్త ప్రాజెక్టులు తక్కువే. పూర్తయిన ఇండ్ల విక్రయాలూ అంతంతే. నిరుడుతో పోల్చితే కొత్త నిర్మాణాలు 54%, ఇండ్ల అమ్మకాలు 42% పడిపోయాయి. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఇదే అత్యధికం. **- ప్రాప్‌ఈక్విటీ**

హైదరాబాద్ ఆఫీస్‌స్పేస్ మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో వర్క్‌స్పేస్ లీజింగ్ 26% క్షీణించింది. నిరుడు ఇదే వ్యవధిలో 29 లక్షల చదరపు అడుగుల్లో లీజింగ్ జరిగింది. ఈసారి మాత్రం 22 లక్షల చదరపు అడుగులకే పరిమితమైంది. **- నైట్ ఫ్రాంక్**

'రియల్' కష్టాలు

స్థిరాస్తి అమ్మకాలపై బిల్డర్లు, రియల్టర్లు తీవ్ర భయాందోళనలకే గురవుతున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వెలిబుచ్చే పరిస్థితి కూడా లేకుండాపోతున్నది. పోస్టులు పెడితే మరే కష్టం ఏవైపు నుంచి వస్తుందోనన్న గుబులు. ఏదిఏ మైనా ఇండస్ట్రీ ఇప్పుడు ఒత్తిడిలో ఉన్నది. ఇండ్లు, ఫ్లాట్లు, వెంచర్లను సందర్శించేవారే లేరు. అమ్మకాల్లేక నిర్మాణ రంగం బాగా దెబ్బతిన్నది. **- క్రెడాయ్ హైదరాబాద్ సభ్యుడు**

నిరుడు పండుగ సీజన్‌లో ఇండ్లు బాగా అమ్ముడుపోయినయ్. కానీ ఈ యేడు ఆ సంబురం లేదు. ఇండ్లు కొనేటోళ్లే లేరు. చూసేందుకూ వస్తలేరు. ఇంకెంత కాలం ఈ తిప్పలు పడాల్నో అర్థమైతలేదు. **-దేవన్న, రియల్‌ఎస్టేట్ మధ్యవర్తి**

అప్పులు తీసుకొచ్చిమరీ ఇండ్లు కట్టాం. ఇప్పుడు అమ్ముడుపోక కష్టపడుతున్నాం. హైడ్రా భయాలతో ఏది కొంటే ఏమవుతుందోనన్న ఆందోళనలు జనాల్లో ఉన్నాయి. ఈ అయోమయం తగ్గేదాకా కొనుగోళ్ల జోలికి పోకపోవడమే మంచిదనుకుంటున్నారంతా. **- జగన్నాథ్‌రెడ్డి, హైదరాబాద్‌లోని బిల్డర్**

అండమాన్ సముద్ర ప్రాంతంలో అల్పపీడనం

- నేటి ఉదయం వాయుగుండంగా మారే అవకాశం
- 23న తూర్పు-మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా ఏర్పడే అవకాశం
- తెలంగాణ, ఏపీలో మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ 22న వాయుగుండంగా మారి, 23న తూర్పు- మధ్య బంగాళాఖాతంలో తుపానుగా ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 24న ఒడిశా, పశ్చిమబెంగాల్ మధ్య తీరం దాటి, వాయవ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారి, ఉత్తర కోస్తా మీదుగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణలో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

అక్కడో నీతి.. ఇక్కడో నీతా?

దళితసామాజిక వర్గాన్ని ఆదుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన దళితబంధు పథకం నిధుల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వనీతి ప్రదర్శిస్తున్నదని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ దళితబంధు లబ్ధిదారులు ధ్వజమెత్తారు. తమ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన దళితబంధు పథకానికి సంబంధించి రెండో విడుత నిధులు విడుదల చేసేందుకు ఈ నెల 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 80 మందికి పైగా లబ్ధిదారులు తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తమ ఖాతాల్లో మొత్తంపై ఫ్రీజింగ్ విధించిన ప్రభుత్వం ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని చింతకాని మండలంలో ఎలా పంపిణీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. క్యాబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోకుంటే సీఎం ఇంటి ఎదుటే చావుడప్పు కొడుతామంటూ అల్టిమేటం జారీ చేశారు. **- కరీంనగర్ కలెక్టరేట్,**

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

ట్రిపుల్‌ఆర్ ప్రజాభిప్రాయ సేకరణను వలిగొండ మండల రైతులు అడ్డుకున్నారు. రెడ్లరేపాక, పహిల్వాన్‌పూర్, ప్రొద్దటూర్, వర్కట్‌పల్లి, గోకారం గ్రామాల్లో ట్రిపుల్ రోడ్డు నిర్మాణం కోసం సేకరిస్తున్న భూమికి మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం అందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి తదితరులు రైతుల అభిప్రాయ సేకరణకు రాగా, తమ డిమాండ్లను ఆమోదించాలని అడ్డుకున్నారు. **- వలిగొండ**

మృత్యువులోనూ కలిసే..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితుల మృతి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 21: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల శివారు కంబాలపల్లి ఫారెస్ట్ పార్క్ వద్ద సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం పోనుగోడుకు చెందిన నీల రమేశ్- గౌతమి దంపతులు రెండో కుమారుడు అరుణ్ కుమార్ (17), అదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్- మంజుల దంపతుల పెద్ద కుమారుడు మణికంఠ(16) చిన్నప్పటి నుంచి స్నేహితులు. అరుణ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని బీసీ గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగా, మణికంఠ హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. దసరా సెలవులు ముగిసిన తరువాత సోమవారం జిల్లా కేంద్రంలో అరుణ్ కుమార్‌ను కళాశాలలో దించడానికి బైక్‌పై పొనుగోడు నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరారు. కంబాలపల్లి ఫారెస్ట్ పార్క్ వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

జూనియర్లకు పూర్తి అదనపు బాధ్యతలు!

- ఇరిగేషన్‌లో సీనియర్లను కాదని పదవులు
- మంత్రి కనుసన్నల్లోనే ఆర్డర్లని ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబర్21 (నమస్తే తెలంగాణ): సీనియార్టీ అక్కర్లేదు. అనుభవ నైపుణ్యాలతో పనిలేదు. నచ్చితే చాలు. రాజకీయ పలుకుడి ఉంటే సరి. ఫుల్ అడిషనల్ చార్జీ వచ్చేస్తున్నది. ఇదీ ఇరిగేషన్‌శాఖలో ఉన్నతాధికారుల తీరు. అంతా సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కనుసన్నల్లోనే కొనసాగుతున్నదని ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు. ఎఫ్ఏసీలుగా (ఫుల్ అడిషనల్ చార్జీ) బాధ్యతలను అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా డిపార్ట్‌మెంట్‌లో ముగ్గురు ఇంజినీర్లకు ఈఈలుగా అదనపు బాధ్యతలను అప్పగించారు. 2004 బ్యాచ్‌కు చెందిన సీనియర్లను పక్కనపెట్టి 2005, 2007 బ్యాచ్‌లకు చెందిన జూనియర్లను ఈఈలుగా, లేదంటే డిప్యూటీ ఎస్ఈలుగా ఎఫ్ఏసీలుగా నియమించడంపైనే ఇంజినీర్లు నిప్పులు చెరుగుతున్నారు. తాజాగా మరొక జూనియర్ డీఈఈకి ఈఈగా అదనపు బాధ్యతలను అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. నిర్మల్ ఇరిగేషన్ సర్కిల్‌లో భైంసాలో డీఈఈ అనిల్‌కు ఆ సర్కిల్‌లోని సీనియర్లను పక్కనపెట్టి డివిజన్ డీఈఈగా అదనపు బాధ్యతలను అప్పగించడంపై రచ్చ కొనసాగుతున్నది. సదరు డీఈఈ బంధువు సచివాలయంలో సెక్రటరీస్థాయి అధికారి అని, రాజకీయ పలుకుబడితోనే ఇలా చేశారని ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు. ఖమ్మంలోనూ 2005 బ్యాచ్‌కు చెందిన ఒకరికి ఇదే తరహాలో డిప్యూటీ ఎస్ఈగా ఎఫ్ఏసీగా నియమించారని గుర్తుచేస్తున్నారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో కీర్తిలత, రాజారామ్‌యాదవ్, పల్లె రవికుమార్, కల్యాణ్‌రావు

అన్ని రంగాల్లో రాష్ట్రం కుదేలు

- కాంగ్రెస్ పాలనపై నమ్మకంలేకే పడిపోయిన ఆదాయం
- యథేచ్ఛగా హైడ్రా కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం పడక
- రాష్ట్రానికి పెట్టుబడుల్లేవు.. ప్రాజెక్టులకు నిధుల్లేవు
- కొవిడ్ కష్టకాలంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు
- అప్పుడు 'వీ' షేప్‌లో రాష్ట్రం అభివృద్ధి.. ఇప్పుడు 'జీరో' షేప్
- రేవంత్‌రెడ్డి సర్కారు పాలనపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 10 నెలల పాలన తెలంగాణలోని ఏ ఒక్క వర్గానికీ నమ్మకం కల్పించలేకపోయిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలో అన్ని రంగాలు కుదేలయ్యాయని, మద్యం అమ్మకాల్లో మినహా రాష్ట్ర ఆదాయం పడిపోయిందని ధ్వజమెత్తారు. కొవిడ్ కష్టకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి అన్నదాతలను ఆదుకుంటే.. కాంగ్రెస్ సర్కారు రైతుబంధును ఎగ్గొట్టి దగా చేసిందని, కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు మధ్య ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ ఉండబట్టే కొవిడ్ సంక్షోభ సమయంలో ప్రజల వద్దకు డబ్బులు చేర్చి ఆర్థికంగా రాష్ట్రం పడిపోకుండా చూశారని తెలిపారు. కొవిడ్ సంక్షోభం తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలు 'యూ' ఆకారంలో నెమ్మదిగా కోలుకుంటే, కేసీఆర్ హయాంలో తెలంగాణ మాత్రం 'వీ' షేప్‌లో వేగంగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రేవంత్ పాలనలో 'యూ' షేప్ లేదు, 'వీ' షేప్ లేదని, అంతా 'జీరో' షేపేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వినోద్‌కుమార్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం సచివాలయంలో ఒకలా, రాత్రి ఐఎస్‌బీలో మరోలా మాట్లాడారని ఆక్షేపించారు. రాష్ట్ర ఆదాయం తగ్గినట్టు అనేక పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ ఆ అంశంపై రేవంత్ లోతుగా సమీక్ష చేయడంలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఏ పల్లెకు వెళ్లినా ఎకరం రూ.20 లక్షలకుపైగానే ధర పలికేదని, ప్రస్తుతం హైడ్రా కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ రంగం దారుణంగా దెబ్బతిన్నదని, ఫలితంగా రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రాజెక్టులకు నిధుల్లేని దుస్థితి నెలకొన్నదని, కానీ సీఎం రేవంత్ మాత్రం రాష్ట్ర జీఎస్‌డీపీని లక్ష కోట్ల డాలర్లకు, హైదరాబాద్ ఎకానమీని 60 వేల కోట్ల డాలర్లకు చేరుస్తానని గొప్పలు చెప్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం దేశ ఆర్థిక రాజధాని ముంబై ఎకానమీ కూడా 300 బిలియన్ డాలర్లు మించలేదని గుర్తు చేశారు. గతంలో కరీంనగర్‌ను లండన్ చేస్తానని కేసీఆర్ చెబితే అపహాస్యం చేసిన పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రేవంత్‌రెడ్డి చెప్తున్న ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీపై స్పందించాలని హితవు పలికారు.

అప్పులపై తప్పుడు ప్రచారం

కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులపై సీఎం రేవంత్, మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రతిరోజూ రూ.200 కోట్లు వడ్డీలు కడుతున్నట్టు మంత్రి సీతక్క చెప్పిన మాటలో వాస్తవం లేదని, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ వడ్డీ కడుతున్నది తెలంగాణ రాష్ట్రమేనని తెలిపారు. ఆర్బీఐ గణాంకల ప్రకారం తమిళనాడు 19.25%, కేరళ 18.97%, ఆంధ్రప్రదేశ్ 14.69%, తెలంగాణ 13.69% వడ్డీ కడుతున్నాయని చెప్పారు. కేసీఆర్ అప్పులు తెచ్చి లక్షలాది రూపాయల ఆస్తులు సృష్టించారని పేర్కొంటూ.. కాంగ్రెస్ 10 నెలల పాలనలో చేస్తున్నదేమిటి? సాధించింది ఏమిటి?' అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్, మంత్రులు, కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు, స్థానిక నాయకులు తెలంగాణను చంపవద్దని, రాష్ట్ర పురోగతిని ఆపవద్దని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజారాం యాదవ్, పల్లె రవికుమార్, భవానీ తదితరులు పాల్గొన్నారు.